
# ప్రజా సేవ

- వి.వి.సుబ్బరాజు




'సారా జగ్గడు' అంటే తెలియనివాళ్లు ఆ నియోజకవర్గంలో లేరంటే అతిశయోక్తి కాదు. ధైర్యంగా గుట్టుగా నాటుసారా కాయడం, దాన్ని సక్రమంగా అన్ని మూలలకూ పంపిణీ చెయ్యడం, పోటీదారులు లేకుండా ఎక్కడికక్కడ ఎప్పటికప్పుడు పకడ్బందీగా గూండాగిరీ, దాదాగిరీ చేసి అణచివెయ్యడం, ఎక్సైజ్ డిపార్టుమెంటు వాళ్లను కట్టుకుని సారా వ్యాపారంలో తనకు తానే సాటి అనిపించుకున్నాడు. 'సారా జగ్గడు'గా పాపులర్ అయ్యాడు.

గొంగళిపురుగు సీతాకోకచిలుకా అయినట్లుగా అతని పరిణామ క్రమం శరవేగంగా జరిగిపోయింది. సారా వ్యాపారంలో రాటుదేలిన జగ్గడు బెల్టు షాపులతో బ్రాందీ వ్యాపారంలో

ప్రవేశించి ఎవరూ ఎదురులేకపోవడంతో 'సారా జగ్గడు' కాస్తా 'బ్రాందీ జగ్గులు' అయ్యాడు. అతని అదృష్టం బావుండి వరుసగా పంచాయతీ, మండల పరిషత్తు, సహకార సంఘాల ఎన్నికలు జరగడంతో అతని వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వృద్ధి చెందింది.

ఆ తరువాత బార్లు, రెస్టారెంట్లు, క్యాబరే క్లబ్బులతో జిల్లా నలుమూలలా విస్తరించాడు. బ్రాందీ డిస్ట్రిబ్యూటర్ అయ్యాడు. జిల్లా మొత్తానికి తానే 'లిక్కర్' డిస్ట్రిబ్యూటర్‌గా ఎదిగిపోయాడు. 'బ్రాందీ జగ్గులు' కాస్తా 'లిక్కర్ జగ్గరావు'గా పబ్లిక్ ఫిగరయ్యాడు. డబ్బుతోపాటుగా వచ్చే సర్వ హంగులు సమకూరిపోయాయి. రెండు మూడు తరాల వరకూ తిన్నా తరగనంత ఆస్తిపాస్తులు ఆర్జించాడు 'లిక్కరు జగ్గారావు'.

ఇక ప్రజాసేవ చెయ్యాలన్న సరదా పుట్టింది. అధికార పార్టీకి భారీగా విరాళం ఇచ్చి ఎమ్మెల్యే సీటు సంపాదించాడు. నియోజకవర్గంలోని అన్నివర్గాల సహకారంతోపాటుగా తన కులబలం, లిక్కర్ మందీమార్బలంతో ఘనవిజయం సాధించాడు. 'ఎమ్మెల్యే జగ్గారావు'గా ప్రజానాయకుడయ్యాడు.

కొత్త మంత్రివర్గం ఏర్పాట్లలో మంత్రి పదవుల కోసం సిగపట్లు ప్రారంభమయ్యాయి. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలలో ఒకే కులానికి చెందిన రెండు వర్గాల మధ్య వంతాలు, పట్టింపులు, బలప్రదర్శనలు, పైరవీలు ఉధృతమయ్యాయి. పరిస్థితి ముఖ్యమంత్రి గారికి పెద్ద తలనొప్పిగా తయారయ్యింది. ఆ ఇద్దరిలో మంత్రి పదవికి ఎవరికి ఇచ్చినా గొడవలు తప్పవు. ఇద్దరికీ ఇచ్చినా గొడవలు తప్పవు. ముఖ్యమంత్రి గారు పార్టీ పెద్దలతో సమాలోచనలు చేసి ఉభయతారకంగా వుంటుందని అదే కులం ఎమ్మెల్యే జగ్గారావుని 'మంత్రి జగ్గారావు గారు'గా చేసేశారు.

మంత్రి జగ్గారావు గారి ప్రమాణ స్వీకార మహోత్సవానికి నియోజకవర్గంలోని గ్రామగ్రామాల నుండి జనం తండోపతండాలుగా బస్సులలో, లారీలలో, ట్రైనులలో రాష్ట్ర రాజధానికి తరలి వచ్చారు. నియోజకవర్గంలోని పారిశ్రామికవేత్తలు, ట్రాన్స్‌పోర్టు కంపెనీలవారు, విద్యాసంస్థల వారు, వైద్య సంస్థల వారు గుప్పించి దినపత్రికలన్నీ నింపేశారు. 'మంత్రి జగ్గారావు' గారిని పూలదండలతో ముంచెత్తి లేపారు. వారి అభిమానానికి 'మంత్రి జగ్గారావు' గారు పరవశించిపోయారు.

మంత్రి పదవి వచ్చిన సందర్భంగా 'తిరుపతి వెంకటేశ్వరస్వామి'ని దర్శించిన తరువాత నియోజకవర్గంలో అడుగుపెట్టాలన్న కోరికతో తిరుపతి ప్రయాణమయ్యారు. 'తిరుపతి'లో ప్రత్యేక దర్శనం, ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. అక్కడ తనకు లభించిన ఆలయ మర్యాదలు మంత్రి జగ్గారావు గారికి మరింత ఆనందాన్ని కలిగించాయి.

ఎంతటి గొప్ప అవకాశం ఇచ్చారు తన నియోజకవర్గం ప్రజలు! వారు తనకు ఓటు వెయ్యడం వల్ల గదా తనకీ గౌరవ పురస్కారాలు లభించాయి!! వారిపట్ల జగ్గారావు గారికి కృతజ్ఞతాపూర్వకమైన ప్రేమ పొంగి పొర్లింది.

తాను సారా వ్యాపారం చేసినా, బ్రాందీ వ్యాపారం చేసినా వాళ్లు ఇళ్లూ, వళ్లూ గుల్ల చేసుకుని తనకి కోటు ఆర్జించి పెట్టారు. ఒకప్పుడు తాను పోలీసులకూ, ఎక్సైజ్ అధికారులకూ వంగి వంగి నమస్కరిస్తూ భయంభయంగా బ్రతికేవాడు. ఈ రోజు కలెక్టర్లూ, కమీషనర్లూ తనకే సలాములు చేస్తున్నారు. ఈ యోగ్యత ప్రజలిచ్చింది. అంచేత వారి కోసం ఏమైనా చెయ్యాలన్న దృఢ నిశ్చయానికి వచ్చేశారు మంత్రి జగ్గారావు గారు.

కొత్త మంత్రి గారిని తిరుపతిలోనే పత్రికా విలేకరులు చుట్టుముట్టారు. 'మంత్రి జగ్గారావు' గారు తన నియోజకవర్గంలో తాను అమలు చెయ్యబోయే కార్యక్రమాలను గురించి ప్రెస్ స్టేట్‌మెంట్ ఇచ్చారు.

మండల కేంద్రాలలో పూర్తి సామర్థ్యం గల ఆసుపత్రులు ఏర్పాటు చేస్తాననీ, ప్రతీ గ్రామానికీ బస్సు సదుపాయం కలుగజేస్తాననీ, బెల్టు బ్రాందీ షాపులు అదుపు చేస్తాననీ, విద్యావ్యాప్తికి ప్రతీ గ్రామంలో స్కూళ్లు అవసరం మేరకు జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేస్తాననీ,

నిత్యావసర సరుకులు అందరికీ అందుబాటులో వుండే విధంగా రేషన్ షాపులు ఏర్పాటు చేస్తాననీ, రైసు మిల్లులలో, టైల్స్ ఫ్యాక్టరీలలో వున్న చైల్డ్ లేబర్‌ని తొలగింపజేస్తాననీ, కార్మికులకు సక్రమంగా సరైన వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటాననీ, కాంట్రాక్టర్లు, ప్రభుత్వోద్యోగులు అవినీతికి, అక్రమాలకు పాల్పడకుండా కఠినంగా వ్యవహరిస్తాననీ, సామాన్యుడికి పూర్తిగా అండగా నిలబడతాననీ ప్రకటన ఇచ్చారు. తన వాగ్దానాలన్నింటినీ త్రికరణశుద్ధిగా అమలుపరుస్తాననీ దైవ సన్నిధిలో వాగ్దానం చేస్తున్నానంటూ భీష్మ ప్రతిజ్ఞ చేశాడు.

రెండు రోజుల తరువాత తన నియోజకవర్గ పర్యటనకు ప్రయాణమయ్యారు. తొలిసారిగా మంత్రిగా తన నియోజకవర్గంలో అడుగుపెట్టిన మంత్రి జగ్గారావు గారు కంగుతిన్నారు. ఎక్కడా స్వాగతం బోర్డు లేదు. జనం లేరు. తాను మంత్రి కాగానే రాజధానికి పరిగెత్తుకు వచ్చిన జనం ఇప్పుడేమయ్యారు? తాను మంత్రి పదవి చేపట్టిన సందర్భంలో పేజీలకు పేజీలు ప్రకటనలు ఇచ్చిన పారిశ్రామికవేత్తలు, ట్రాన్స్‌పోర్టు వాళ్లూ, కాలేజీల వాళ్లూ, డాక్టర్లు, కాంట్రాక్టర్లు, లిక్కర్ వ్యాపారులు ఏమయ్యారు? అర్థంకాక ఆశ్చర్యంతోపాటుగా అయోమయంలో పడ్డారు. మంత్రి జగ్గారావు గారు బేలగా తన పి.ఏ. బ్రహ్మాన్ని చేరబిలిచి, 'మన ప్రజలేమయ్యారయ్యా!' అన్నారు గుబులుగా.

'అయ్యా! ప్రజలు సభలకు, ఊరేగింపులకు రావాలంటే వాళ్లకి సారా ప్యాకెట్లూ, పలావు ప్యాకెట్లూ ఇవ్వాలండీ. ఆపైన పదో పరకో రొక్కం ముట్టజెప్పాలండీ. అవి లేకుండా వాళ్లు ఓటెయ్యడానికి కూడా రారండీ. మనకి జనాన్ని తోలుకు వచ్చేవాళ్లూ, స్వాగతం బ్యానర్లు కట్టేవాళ్లూ, దండలు వేసేవాళ్లూ, బాణాసంచా పేల్చేవాళ్లూ, పేపర్ యాడ్స్ ఇచ్చేవాళ్లూ ప్రజలు కాదండీ. పారిశ్రామికవేత్తలు, కాంట్రాక్టర్లు, ట్రాన్స్‌పోర్టు కంపెనీల వాళ్లు, లిక్కర్ వ్యాపారస్తులు, విద్యా వ్యాపారస్తులు, వైద్య వ్యాపారస్తులు, మిల్లర్లూనండీ. తమరు మొన్న తిరుపతిలో ప్రెస్‌మీట్‌లో వాళ్ల పొట్టగొడతానని స్టేట్‌మెంట్ ఇచ్చారు కదండీ! దాని ఎఫెక్టండీ ఇది!!. మీ మాటలకే ఇంత ఎఫెక్ట్ వచ్చిందంటే, ఇక తమరు చేతల్లోకి దిగితే మంత్రి పదవి ఊడడం ఖాయమండీ!' అంటూ కాలజ్ఞానాన్ని బోధించాడు పి.ఏ. బ్రహ్మం.

అమాత్యవర్యులకు జ్ఞానోదయం అయింది. మంత్రిగా కొనసాగాలంటే ఏ ప్రజలను సేవించవలసి వుందో, ఏ తరహా ప్రజాసేవ చెయ్యవలసి వుందో మంత్రి జగ్గారావు గారికి స్పష్టంగా అర్థమయ్యింది. ☆

---

## మల్లెలు

ముక్కుపుటాల్ని
గుండెపుటల్నీ తట్టేవి.

## విత్తనం

చినుకు తడితే
మట్టిలోంచి పచ్చగా నవ్వేది.

## తుఫాను

గాలి చేతుల్లో
చెట్ల చెంపల్ని ఈడ్చిఈడ్చి కొట్టేది.

## నైట్ క్వీన్

వచ్చే పోయే వారికి
రాత్రి పరిమళాన్ని పూసేది.

## జ్ఞాపకం

గాయం రేగితే
గతం కళ్లు తెరిచేది.

## దుఃఖం

తేరుకున్నాక
స్మృతి మరక.

– పి.శ్రీనివాసగౌడ్

---

Edited, Printed and published by Anil Inaganti for Monica Publications, 79B, Journalists Colony, Jubilee Hills, Hyderabad - 500 033. E-mail: patrika@hotmail.com. Printed at Dharani Printers, 6-3-985, Yousuf Building, Khairatabad, Hyderabad - 500 004.